## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

### జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి

తమ్మడపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజేందర్‌రెడ్డి

బచ్చన్నపేట, అక్టోబర్ 14 : పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తమ్మడపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అసిస్టెంట్ రిజిస్ట్రార్ వేణుగోపాల్, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కేంద్రానికే ధాన్యాన్ని తరలించాలన్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో బాలస్వామి, మాజీ సర్పంచ్ మేకల కవితారాజు, సొసైటీ డైరెక్టర్ బేజాడి సిద్ధులు, ప్రభాకర్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దామోదర్, రాజయ్య, ఉపేందర్‌రెడ్డి, శ్రీను, రాజయ్య, నాగరాజు, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఏఈకి సన్మానం

దేవరుప్పుల, అక్టోబర్ 14: మండలంలోని సింగరాజుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌కో ఏఈగా విధులు నిర్వర్తించిన రాజవర్ధన్‌రెడ్డి జనగామకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం సన్మానించారు. ధరావత్ తండా మాజీ సర్పంచ్ బానోత్ గేమానాయక్, రైతులు రామ్‌ధన్‌నాయక్, బానోత్ జగన్నాయక్ మాట్లాడుతూ రాజవర్ధన్‌రెడ్డి సేవలను కొనియాడారు. ఇదిలా ఉండగా దేవరుప్పుల సబ్‌స్టేషన్ ఏఈ సుధాకర్ నర్మెటకు బదిలీపై వెళ్లగా, పడమటి కేశ్వాపూర్‌లో ఏఈగా పనిచేస్తున్న నర్సింహారెడ్డి దేవరుప్పులకు, నర్మెట ఏఈ నర్సింహ సింగరాజుపల్లికి బదిలీ అయ్యారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న యూత్ సభ్యులు

తరిగొప్పుల, అక్టోబర్14 : అపదలో ఉన్న పేదలకు అండగా ఉంటామని నవ యువత యూత్ అధ్యక్షుడు కర్ణాకర్ అన్నారు. మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన గొలుసుల రాములు ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న కర్ణాకర్ సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు విజయ్, సంపత్, ఉదయ్, ప్రవీణ్, చరణ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## నాగులమ్మ దేవస్థాన కమిటీ చైర్మన్‌గా మనోహర్

కొడకండ్ల, అక్టోబర్ 14 : మండల కేంద్రంలోని నాగులమ్మ దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా మసురం మనోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ తనను చైర్మన్‌గా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. హనుమాన్ విగ్రహం సహా దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగులమ్మ దేవస్థాన గౌరవాధ్యక్షుడు సింగరం చంద్రయ్య పాల్గొన్నారు.

## 'బతుకమ్మ' విజేతలకు బహుమతుల ప్రదానం

విజేతలకు బహుమతులందిస్తున్న బ్రహ్మారెడ్డి

జఫర్‌గఢ్, అక్టోబర్ 14 : మండలంలోని తమ్మడపల్లి(జీ)లో సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో సమావేశం నిర్వహించారు. పెద్ద బతుకమ్మ, రంగు రంగుల బతుకమ్మ, పాటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ఆయన బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి వేల్పుల యాదమ్మ, ద్వితీయ, తృతీయ బహుమతులు నక్క రజిత, పందిబోయిన లక్ష్మీ గెలుపొందారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అన్నారు. ఈ పోటీలు అందరిలో ఉత్సాహాన్నిచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ మారపల్లి ప్రభాకర్, మాజీ సర్పంచ్ చిటిమిళ్ల కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ చిలువేరు శివయ్య, మాజీ ఉప సర్పంచ్ శరీఫోద్దీన్ పాల్గొన్నారు.

## యువత లక్ష్య సాధనకు కృషి చేయాలి : సీఐ

తాటికొండలో మాట్లాడుతున్న సీఐ వేణు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 14 : యువత లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు కృషి చేయాలని సీఐ జీ వేణు అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని తాటికొండలో పోలీస్ కళాజాత నిర్వహించి నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వేణు మాట్లాడుతూ యువత గంజాయి, గుట్కా , గుడుంబా, గ్యాంబ్లింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వీరిపై తల్లిదండ్రులు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాల సమాచారం తెలిస్తే 87125 84473 నంబరుకు సమాచారం అందించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ బ్యాంకు అకౌంట్ వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేశ్, ఏఎస్సై రాజమౌళి, గ్రామ ఇన్‌చార్జి కానిస్టేబుల్ కుమారస్వామి, కళాబృందం ఇన్‌చార్జి నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రం, రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# రంగప్ప చెరువు సుందరీకరణకు ప్రతిపాదనలు పంపండి

- జనగామ పట్టణంలో చెత్త నిర్వహణ పనుల్లో లోపాలు సరిచేయాలి
- మున్సిపల్‌శాఖ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ వీపీ గౌతమ్

చంపక్‌హిల్స్‌లోని డంపింగ్ యార్డు డీపీఆర్ సెంటర్‌తోపాటు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న గౌతమ్

జనగామ, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని రంగప్ప చెరువు సుందరీకణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని మున్సిపల్‌శాఖ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ (సీడీఎంఏ) వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి సోమవారం పట్టణంలోని చంపక్‌హిల్స్ డంపింగ్ యార్డ్, డీఆర్‌సీ కేంద్రం, రంగప్ప చెరువు, డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శించి తనిఖీ చేశారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో చెత్త నిర్వహణలో లోపాలు సరిచేసి పారిశుధ్య పనులు సరిగా చేయాలని ఆదేశించారు. చంపక్‌హిల్స్ డంపింగ్‌యార్డ్‌ను సందర్శించిన ఆయన వివిధ అంశాలను పరిశీలించి చెత్త నిర్వహణ సరిగా ఉండాలని సూచించారు. సేకరించిన చెత్తను బయోమైనింగ్ పూర్తిచేసి తరలించాలన్నారు.

**పేరుకుపోయిన చెత్తను త్వరగా తరలించాలి**

డీసీఆర్ కేంద్రంలో పేరుకుపోయిన పొడి చెత్తను తరలించాలని, వర్మీ కంపోస్టు షెడ్‌లోనే ఎరువును తయారు చేయాలని గౌతమ్ ఆదేశించారు. చాకలి ఐలమ్మనగర్‌లో మూడో విడుత ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నిర్మిస్తున్న రెండు పడకల గదులను పరిశీలించారు. నిధులకు కొరత లేదని, ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్‌లో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి, సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు ఉన్నారు.

## స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 14 : నూతన పాలకవర్గం రైతులు, వ్యాపారులకు న్యాయం చేస్తూ వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. సోమవారం మండలంలోని శివునిపల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా హైవేపై ఉన్న బీఆర్ అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మార్కెట్ చైర్‌పర్సన్‌గా జూలుకుంట్ల లావణ్యా శిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా నూకల ఐలయ్యతోపాటు 12 మంది డైరెక్టర్లతో జిల్లా మార్కెట్ అధికారి బీ నరేంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలందిస్తూ, మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీకి సేవ చేసే వారికి అవకాశాలు వస్తాయి తప్ప ఏఐసీసీ, పీసీసీ చెప్పినా, గ్రూపు రాజకీయాలు చేస్తూ, పార్టీని భ్రష్టు పట్టించే వారికి పదవులు రావని శ్రీహరి అన్నారు. రానున్న రోజుల్లోనూ పార్టీ బలోపేతానికి కృషి చేసే నాయకులకే పదవులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జన్ను భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీశ్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్లు అన్నెబోయిన భిక్షపతి, అన్నం బ్రహ్మారెడ్డి, గుజ్జరి రాజు, నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్‌రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఐత వీరేశం, వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు తోట వెంకన్న, నెలమంచి శైలజాఅజయ్ రెడ్డి, సింగపురం వెంకటయ్య, అంబటి కిషన్‌రాజు, బూర్ల శంకర్, సుధాకర్‌బాబు, పల్లె రవి, మంద రాజు పాల్గొన్నారు.

## నేడు నూతన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 14 : డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో మంగళవారం పాఠశాలల కేటాయింపు కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో కే రాము తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటలలోపు స్కూల్ అసిస్టెంట్, పండిట్, వ్యాయామ ఉపాధ్యాయులు, మధ్యాహ్నం 12 గంటలలోపు ఎస్జీటీలు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎల్బీ స్టేడియంలో తీసుకున్న ఒరిజినల్ నియామక పత్రంతో హాజరుకావాలని సూచించారు. అటెండ్ కాని వారికి మిగిలిపోయిన ఖాళీల్లో పోస్టింగ్ ఉత్వర్వులు జారీ చేస్తామని తెలిపారు. ఖాళీలు, మెరిట్ జాబితా వివరాల కోసం జిల్లా విద్యాశాఖ ఆన్‌లైన్ వెబ్ సైట్ ఐడీ www.deojangaon.com అందుబాటులో ఉన్నాయని రాము పేర్కొన్నారు.

## నిరంతర కృషితో లక్ష్యాలు సాధించాలి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 14 : లక్ష్యం కోసం పట్టుదల, అంకితభావంతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని, ఇందుకు నిదర్శనం కృష్ణవేణి అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని విశ్వనాథపురంలో మాచర్ల ఎల్లయ్య, హైమావతి దంపతుల కూతురు కృష్ణవేణికి పుట్టుకతో రెండు కాళ్లు చచ్చుబడి పోయాయి. అయినా ధృడ సంకల్పంతో ఎంబీఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేయడమే గాక అథ్లెటిక్స్ పోటీల్లో నాలుగు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించి తెలంగాణకు గుర్తింపు తీసుకొచ్చింది. వచ్చే నెలలో థాయిలాండ్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో సిట్టింగ్ పారా త్రోబాల్ క్రీడలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో ప్రయాణ ఖర్చులకు రూ.లక్షా 20 వేలు అవసరమవుతాయని తెలిపింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనవంతుగా ఆమెకు రూ.35 వేలు అందించారు. ఇతరుల ద్వారా మరికొంత సాయం చేశారు. క్రీడల్లో విజయం సాధించి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. దీంతో క్రీడాకారిణి ఎమ్మెల్యే కడియం శ్రీహరితోపాటు దాతలకు కృతజ్ఞతలు తెలిపింది.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

### అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 14 : ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో 17 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన గుంటిపల్లి యాకయ్యతో పాటు మరికొందరికి సర్వే నంబర్ 590లో వారసత్వంగా రావాల్సిన 16 గుంటల భూమిలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సర్వే నంబర్ 590/1 పేరిట బయటి వ్యక్తులకు ఇంటి నిర్మాణం కోసం అనుమతి ఇచ్చారని ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. జనగామ పట్టణంలోని సాయినగర్, బాలాజీనగర్, గిర్నిగడ్డ ఏరియాకు చెందిన అనిత, నర్సోజీ, ఆర్ కోటేశ్వర్, పత్తిపాక దినేశ్ అంత్యోదయ, తెలుపు రేషన్ కార్డు, దివ్యాంగుల పింఛన్, ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయించాలని దరఖాస్తులు అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు అర్జీ సమర్పించారు. ఏసిరెడ్డి నగర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లకు మంచినీటి వసతి లేక 200 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నందున బోర్లు వేయించాలని అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వసంత, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, కలెక్టరేట్ ఏవో మన్సూరీ పాల్గొన్నారు.

## నేటి నుంచి బతుకమ్మ కుంట దుర్గామాత ఉత్సవాలు

సారె సమర్పిస్తున్న పూసల సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు

జనగామ, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంట శ్రీవిజయ దుర్గామాత ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసిందని ఆలయ అధ్యక్షులు పిట్టల సత్యం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగే ఉత్సవాల కోసం పూసల సంఘం ఆధ్వర్యంలో మహిళలు, ప్రతినిధులు దుర్గమ్మ, ఎల్లమ్మ తల్లులకు సారె, పూజా సామగ్రిని సమర్పించారు. శుభకార్యం జరిగేటప్పుడు మంగళకరమైన పసుపు, కుంకుమ, గంధం, గాజులు, నల్లపూసలు, ముత్యాలు, పవుడాలు, బొట్టు, కాటుక, పూలు చీరెలు తొలి కానుకగా పూసల సమాజం తరపున అందించడం అనవాయితీగా వస్తున్నదని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో పూసల భవనం నుంచి ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి ఆలయానికి భక్తులు చేరుకొని పూజల అనంతరం మొక్కులు సమర్పించారు. నేడు ఎల్లమ్మ తల్లి కల్యాణం సందర్భంగా వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సహాస్థానిక కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, పూసల సంఘం నుంచి పన్నీరు సత్యం, రాష్ట్ర నాయకులు, చిన్నిపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నాగిశెట్టి శ్రీనివాస్, అదనపు ప్రధాన కార్యదర్శి తుపాకుల బాల నారాయణ, జిల్లా సంచార జాతుల సంఘం అధ్యక్షుడు, పూసల హౌసింగ్ మ్యాక్స్ కోశాధికారి పగిడిపల్లి చంద్రమౌళి, ప్రతినిధులు పగిడిపల్లి శ్రీనివాస్, పన్నీరు రవీందర్, పన్నీరు నగేశ్, పన్నీరు శ్రీనివాస్, బోశెట్టి కుమార్, పగిడిపల్లి రామస్వామి, పన్నీర్ రాజు, కావేటి రాజు పాల్గొన్నారు.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

దేవరుప్పుల, అక్టోబర్ 14 : మండలంలోని సింగరాజుపల్లికి చెందిన ఓ మహిళ డయల్-100కు కాల్ చేయగా, దీనిని పర్యవేక్షించేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌పై దుర్భాషలాడడమేకాక విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 12వ తేదీ రాత్రి సింగరాజుపల్లి నుంచి 100 డయల్ కాల్ రాగా వెంటనే అక్కడికి వెళ్లిన కానిస్టేబుల్ మహ్మద్ మసూద్ సమాచారం సేకరిస్తున్న తరుణంలో అదే గ్రామానికి చెందిన మేడ నగేశ్ అక్కడికి వచ్చాడు. మసూద్‌తో అసభ్యంగా ప్రవర్తించడమేగాక దుర్భాషలాడాడు. దీనిపై మసూద్ ఫిర్యాదు మేరకు నగేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు గ్రామాలకు వచ్చే పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు

## సీహెచ్‌సీలో ఆరోగ్యమేళా

బచ్చన్నపేట, అక్టోబర్ 14 : మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సోమవారం ప్రత్యేక డాక్టర్లతో ఆరోగ్యమేళా నిర్వహించారు. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ ఆజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రతి నెల రెండో శనివారం నిర్వహించాల్సి ఉండగా దసరా సందర్భంగా సోమవారం ఆరోగ్యమేళా కొనసాగించారు. పరిసరాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ ఆదిలక్ష్మి, నేత్ర వైద్య నిపుణులు అరుణ, డాక్టర్లు సృజన, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలి : సీపీఎం

జనగామ చౌరస్తా, అక్టోబర్ 14 : వీధి కుక్కలు, కోతుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బూడిద గోపీ, జోగు ప్రకాశ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వీధి కుక్కలు, కోతులు స్వైర విహారం చేస్తూ చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతున్నదని పేర్కొన్నారు. పిల్లలు, పెద్దలు ఆరుబయట ఒంటరిగా కూర్చోవాలన్నా, మార్కెట్, వాకింగ్‌కు వెళ్లాలన్నా భయాందోళనకు గురౌతున్నారని తెలిపారు. ఇటీవల ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఐస్‌క్రీం పార్లర్ వద్ద ఓ బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన ఘటన కలకలం సృష్టించిందని పేర్కొన్నారు. బతుకమ్మకుంటలో వాకింగ్‌కు వెళ్లిన ఆరుగురిపై కోతులు దాడిచేసి గాయపర్చిన ఉదంతాన్ని వివరించారు. వీధి కుక్కలు, కోతుల నివారణ కోసం కలెక్టర్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చుంచు విజేందర్, అజారుద్దీన్, లింగం, పల్లెర్ల లలిత, కల్యాణి, ఉపేందర్, ప్రశాంత్, మునీర్, దేవదానం, లక్ష్మీనర్సింహారెడ్డి, పద్మ, రజిత, కనకాచారి, కుమార్, పద్మ, భవాని పాల్గొన్నారు.

## దృష్టి మరల్చి.. డబ్బుల సంచి దొంగిలించి

### రైతు నుంచి రూ.40 వేలు దోచుకెళ్లిన దొంగలు

చోరీ వివరాలు తెలుసుకుంటున్న సీఐ మహేందర్‌రెడ్డి

దేవరుప్పుల, అక్టోబర్ 14 : బ్యాంకు నుంచి రైతు డబ్బులు డ్రా చేసి తీసుకెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అతడి దృష్టి మరల్చి చోరీ చేసిన ఘటన మండలంలోని రాంభోజీగూడేంలో జరిగింది. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాంభోజీగూడేనికి చెందిన రైతు పెండ్లి మల్లయ్య తన టీవీఎస్ ఎక్సెల్‌పై సోమవారం సింగరాజుపల్లిలోని ఏపీజీవీబీ బ్యాంకుకు వచ్చాడు. తన అకౌంట్‌లోని రూ.40 వేలు డ్రా చేసుకుని వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు గమనించారు. సీతారాంపురం గ్రామానికి వచ్చే దారిలో దుర్గమ్మ గుడి సమీపంలో మల్లయ్య వాహనాన్ని ఆపి 'నీ డబ్బులు కిందపడ్డాయి..' అని అన్నారు. దీంతో రోడ్డుపై చూస్తే డబ్బులు కనిపించడంతో వాటిని సేకరించే పనిలో ఉన్న మల్లయ్య దృష్టి మరల్చి అతడి టీవీఎస్ ఎక్సెల్‌లో దాచిన రూ.40 వేలను తీసుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, సంఘటనా స్థలాన్ని పరిశీలించామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. నిందితుడి కోసం దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై సృజన్‌కుమార్, కానిస్టేబుల్ యాకయ్య ఉన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి మృతి

రఘునాథపల్లి, అక్టోబర్ 14: మద్యానికి బానిసై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కోమల్లలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లపల్లి యాకస్వామి (35)కి ఇదే గ్రామానికి చెందిన తాల్లపల్లి రమ్యతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమార్తెలు కలిగారు. యాకస్వామి పెయింటింగ్ చేస్తుంటాడు. కొద్దిరోజులుగా ఆర్థిక ఇబ్బందులు నెలకొనడంతో తరుచూ భార్యతో గొడవపడుతున్నాడు. దీంతో విసిగిపోయిన రమ్య కుమార్తెలతో కలిసి కొంతకాలంగా ఖాజీపేటలో ఉంటున్నది. దీంతో మనస్తాపానికి గురైన యాకస్వామి సోమవారం మద్యం అతిగా సేవించి మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

## క్షీరగిరి క్షేత్రంలో భక్తుల కోలాహలం

పాలకుర్తిలోని సోమేశ్వరాలయంలో భక్తులు

పాలకుర్తి, అక్టోబర్ 14 : మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దసరా సెలవుల నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి క్యూలైన్‌లో వచ్చారు. అనంతరం సోమేశ్వరుడు, లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కొండ దిగువన ఉన్న ఆంజనేయస్వామి, చండికా అమ్మవారు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అర్చకులు డీవీఆర్ శర్మ, అనిల్‌శర్మ, మత్తగజం నాగరాజు, సునిల్ పాల్గొన్నారు.

## జిల్లాలో రూ. 21.84 కోట్ల మద్యం విక్రయం

### దసరా పండుగకు భారీగా ఆదాయం

జనగామ చౌరస్తా, అక్టోబర్ 14 : ఈ దసరా పండుగకి జిల్లాలో రూ. 21 కోట్ల 84 లక్షల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ కే అనిత తెలిపారు. సోమవారం ఆమె వివరాలు వెల్లడించారు. ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) 21036 కార్టన్స్, బీర్లు 37247 కార్టన్స్ అమ్మకాలు జరిపినట్లు పేర్కొన్నారు. గతేడాది దసరా పండుగకి ఐఎంఎల్ 16312 కార్టన్స్, బీర్లు 28169 కార్టన్స్ విక్రయాలు జరిగాయని తెలిపారు. అప్పటితో పోలిస్తే ఈ ఏడాది రూ.4 కోట్ల 34 లక్షల మద్యం అదనంగా విక్రయించినట్లు తెలిపారు. జిల్ల